క్లుప్తంగా

అంజన్నకు పూజలు



ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

శివ్వంపేట(నర్సాపూర్): చాకరిమెట్లలో కొలువైన సహకార ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం భక్తులతో నిండిపోయింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు అభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు సత్యనారాయణస్వామి మండపంలో సామూహిక వ్రతాలు ఆచరించారు. కార్యక్రమంలో ఈఓ శ్రీనివాస్, ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయశర్మ, ప్రధాన అర్చకులు దేవాదత్తశర్మ, ప్రభుశర్మ, దేవిశ్రీ, తదితరులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల పరిశీలన



బీకొండాపూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

చేగుంట(తూప్రాన్): మండలంలోని కొనుగోలు కేంద్రాలను శనివారం తహసీల్దార్ గియాసున్నీసాబేగం సందర్శించారు. ఈ సందర్భంగా బోనాల్, బీకొండాపూర్‌లోని కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం సేకరించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లోని రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ పరిశీలనలో ఆర్ఐ నర్సింగ్‌యాదవ్ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, రైతులు ఉన్నారు.

ముగిసిన శ్రీ రామనవమి ఉత్సవాలు



పెద్దశంకరంపేటలో సీతారాముల పల్లకీసేవ

పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో శ్రీ రామనవమి ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. వారం రోజులుగా వివిధ కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. చివరి రోజు మహిళలు ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ పురవీధులగుండా సీతారాముల ఉత్సవ విగ్రహాలను భాజాభజంత్రీల మధ్య ఊరేగించారు.

పారిశుద్ధ్య పనులు సకాలంలో చేపట్టాలి



ప్రజలతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్

నర్సాపూర్: పారిశుద్ధ్య పనులు సకాలంలో చేపట్టాలని మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని జగన్నాథరావు కాలనీలో మున్సిపల్ చైర్మన్ శనివారం పర్యటించారు. కాలనీలో తిరుగుతూ తాగు నీరు సరఫరా, ఇతర సమస్యలు ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలో సీసీ రోడ్లు ఇతర సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. తాగు నీరు సక్రమంగా సరఫరా అయ్యేట్లు చూడాలని సిబ్బందికి సూచించారు.

కాంగ్రెస్ వైపే ప్రజలు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

నర్సాపూర్: కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేస్తుందన్న నమ్మకంతో ప్రజలు ఉన్నారని మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి చెప్పారు. శనివారం మెదక్‌లో కాంగ్రెస్ అభ్యర్థి నీలంమధు నామినేషన్‌లో భాగంగా రోడ్ షోలో పాల్గొనేందుకు సీఎం రేవంత్‌రెడ్డి వస్తున్నారని వారు చెప్పారు. సీఎం వస్తున్నారని సమాచారం ఇవ్వడంతో నియోజకవర్గం నుంచి పార్టీ కార్యకర్తలు భారీ ఎత్తున తరలినారని వారు అన్నారు.

నిరుపయోగంగా డబుల్ బెడ్రూంలు

- నిర్మాణాలు పూర్తయినా.. కేటాయించని వైనం
- ఎదురుచూస్తున్న లబ్ధిదారులు



చేగుంటలో నిర్మించిన డబుల్ బెడ్రూంలు

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం పేదల కోసం అన్ని రకాల వసతులతో డబుల్ బెడ్రూంలను నిర్మించారు. కానీ ఇంతవరకు పేదలకు ఇవ్వక పోవడంతో 108 డబుల్ బెడ్రూంలు నిరుపయోగంగా ఉన్నాయి. మండల కేంద్రం చేగుంటలోని మోడల్ కాలనీలో గత ప్రభుత్వం 108 డబుల్ బెడ్రూం ఇళ్లను అందించాలని నిర్మాణాలు ప్రారంభించి 2023లో పూర్తి చేశారు. అసెంబ్లీ ఎన్నికల ముందు లబ్ధిదారులకు అందించాలని కసరత్తు ప్రారంభించారు. దాదాపు 7 వందల మంది పేదలు తమ పేర్లను ప్రకటించారు. 108 ఇళ్లకుగాను దాదాపు 40 మంది అనర్హులకు ఇళ్లను కేటాయించారని గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. దీంతో లబ్ధిదారులకు డబుల్ బెడ్రూంలను అందించే ప్రక్రియ నిలిచి పోయింది. నాటి నుంచి అవి నిరుపయోగంగా ఉండటంతో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన దరఖాస్తుల్లో భాగంగా 5 వందలకు పైగా డబుల్ బెడ్రూంల కోసం దరఖాస్తులు అందించారు. ఉపాధి కోసం చేగుంట పట్టణానికి వచ్చి ఇక్కడే స్థిరపడి ఏళ్లతరబడి అద్దె ఇళ్లలో ఉంటూ జీవనం సాగిస్తున్న పేదలు సైతం చేగుంటలో ఉన్నారు. బీఆర్ఎస్ హయాంలో డబుల్ బెడ్రూంల కేటాయింపులో అవకతవకలు జరిగాయని ఆరోపణలు ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ప్రజాపాలనలో పేదలను గుర్తించి డబుల్ బెడ్రూంలను నిరుపేదలకు అందించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

30 ఏళ్లుగా అద్దె ఇంట్లో ఉంటున్న



బతుకు దెరువుకోసం చేగుంటకు వచ్చి 30 ఏళ్లుగా అద్దె ఇంట్లో ఉంటున్న. ఆరు నెలల క్రితమే డబుల్ బెడ్రూం ఇల్లు అందిస్తామని చెప్పారు. స్థానిక ఉంటున్న పేదలతో పాటు ఉపాధికోసం వచ్చి స్థిరపడిన ఇళ్లు లేని నాలాంటి వారికి డబుల్ బెడ్రూంలు ఇవ్వాలి.

– ఉపులం సత్యనారాయణ, చేగుంట

పంపిణీకి డబుల్ బెడ్రూంలు సిద్ధం

చేగుంటలో 108 డబుల్ బెడ్రూంల ఇళ్లను పూర్తి చేసి పంపిణీకి సిద్ధంగా ఉంచాం. ఎన్నికల కోడ్ ముగియగానే డబుల్ బెడ్రూంలు అందించేందుకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చే అవకాశం ఉంది. ప్రభుత్వం ఇచ్చే మార్గదర్శకాల ప్రకారం వాటిని పంపిణీ చేస్తాం.

– నర్సింలు, పీఆర్ ఈఈ మెదక్

కేంద్రాలు సరే.. కొనుగోళ్లు మరీ..



చండూర్ కొనుగోలు కేంద్రంలోని ధాన్యం నిల్వలు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్ల కేంద్రాలు ప్రారంభమై 12 రోజులు గడుస్తున్నా.. ధాన్యం కొనుగోళ్లు మాత్రం జరగడం లేదు. కలెక్టర్ ఆదేశాల మేరకు ధాన్యం కేంద్రాలు ప్రాంభించినప్పటికీ ధాన్యం తూకం జరగడం లేదు. ఓ వైపు ధాన్యం కేంద్రాల వద్ద ఉంచిన ధాన్యం కొనుగోలు జరగక, మరో వైపు వాతావరణ పరిస్థితితో రైతులు సతమతమవుతున్నారు. వర్షం కురిస్తే తమ పరిస్థితి ఆగమవుతుందని, ఇకనైనా త్వరగా కొనుగోళు చేపట్టాలన్ని పలువురు రైతులు కోరుతున్నారు.

పెద్దమ్మ విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు ప్రారంభం

కొల్చారం(నర్సాపూర్): మండలం నుంచి పోతంశెట్టిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన పెద్దమ్మ విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి హాజరైన రంగంపేట ఆశ్రమం పీఠాధిపతి మాధవానంద స్వామి ప్రతిష్ఠాపన చేసే దేవతా విగ్రహాలకు పూజలు చేసి, హారతి ఇచ్చారు. శాస్త్ర యుక్తంగా కార్యక్రమాలు చేపట్టాలని ఆలయ నిర్వాహకులకు సూచించారు. సోమవారం అమ్మవారి కల్యాణం నిర్వహించనున్నారు.



విగ్రహాలకు హారతినిస్తున్న మాధవానంద స్వామి

కొనసాగుతున్న కోదండ రామస్వామి ఉత్సవాలు



స్వామివారికి చంద్ర వాహన పల్లకీసేవ

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలో కొలువైన కోదండ రామస్వామి ఉత్సవాలు కనుల పండువగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నాల్గవ రోజు శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. రాత్రి స్వామివారిని చంద్ర వాహన పల్లకీసేవ గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారికి హారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో వేద పండితుడు శాస్త్రుల వామనశర్మ, చందు పంతులు ఉత్సవ కమిటీ నిర్వాహకులు, గ్రామస్తులు ఉన్నారు.

బీజేపీ నాయకుల ఇంటింటి ప్రచారం



అల్లాదుర్గం(మెదక్): కాయిదంపల్లిలో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు



పెద్దశంకరంపేటలో..



టేక్మాల్(మెదక్): హెచ్‌ఎంపల్లిలో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

పెద్దశంకరంపేట(మెదక్): జహీరాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థిగా బీబీ.పాటిల్‌ను గెలిపించాలని కోరుతూ బీజేపీ మండలాధ్యక్షుడు కోణం విఠల్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం కొనసాగుతోంది. శనివారం మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో బీజేపీ చేపట్టిన అభివృద్ధిపై కరపత్రాల ద్వారా ప్రచారం చేశారు. మరోసారి బీజేపీని భారీ మెజార్టీతో గెలిపించాలని వారు కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రావణ్‌కుమార్, శ్రీహరి, రాజు, కిషన్, కృష్ణ తదితరులు ఉన్నారు.

టేక్మాల్(మెదక్): మండలంలోని కదీలబాయితండా, హెచ్‌ఎంపల్లి, హెచ్‌ఎంపల్లి తండాలో బీజేపీ నాయకులు లాభార్తి సంపర్క్ అభియాన్‌లో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ఇంటింట వివరించారు. కమలం గుర్తుకు ఓటు వేసి జహీరాబాద్‌లో బీజేపీ అభ్యర్థి బీబీపాటిల్‌ను గెలిపించాలని కోరారు. ఇందులో మండలాధ్యక్షుడు నవీన్, మండల ప్రధాన కార్యదర్శి సిద్ధిరాములు ఉపాధ్యక్షుడు రాములు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్లుపేట రాజు, యువమోర్చా అధ్యక్షుడు పవన్ పట్టణాధ్యక్షుడు నాగరాజు, మహేశ్, సికిందర్, నరేశ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అల్లాదుర్గం(మెదక్): గ్రామాల్లో బీజేపీ ప్రచారానికి ప్రజల్లో మంచి స్పందన వస్తుందని మండల బీజేపీ అధ్యక్షుడు యాదగిరి, జిల్లా నాయకులు రాములు అన్నారు. శనివారం మండల పరిధిలోని కాయిదంపల్లి గ్రామంలో ప్రచారం చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల కార్యదర్శి సాయిలుగౌడ్, రమేశ్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

నీటి సరఫరా అడ్డుకున్న బీఆర్ఎస్ నాయకులు

చేగుంట(తూప్రాన్): మండలంలోని బీకొండాపూర్ గ్రామంలో భగీరథ నీటి సరఫరా పనులను బీఆర్ఎస్ నాయకులు అడ్డుకుంటున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో మంచినీటి సరఫరా కోసం డబుల్‌బెడ్రూం ఇళ్ల సమీపంలో వాటర్‌ట్యాంకు నిర్మించారు. నీటిసరఫరా ఏర్పాట్లు లేకపోవడంతో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డికి గ్రామస్తులు సమస్యను వివరించగా.. అధికారులతో మాట్లాడి నీటి సరఫరా పనుల కోసం చర్యలు తీసుకున్నారు. కొందరు బీఆర్ఎస్ నాయకులు కోడ్ ఉందని బెదిరించి నీటిసరఫరా పనులు చేయకుండా అడ్డుకున్నట్లు ఆరోపించారు.



బీకొండాపూర్‌లో నిర్మించిన వాటర్ ట్యాంకు

అధికారులు స్పందించి నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వైభవంగా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన



యజ్ఞం చేస్తున్న భక్తులు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని సంగాయిపేటలో నూతనంగా నిర్మించిన రేణుకా ఎల్లమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండో రోజు శనివారం కార్యక్రమంలో భాగంగా మూలమంత్రం, ఆలయ ఆవరణలో యజ్ఞం నిర్వహించారు. అమ్మవారి విగ్రహంతో పాటు ఇతర దేవతా విగ్రహాలను మంజీరా నది నుంచి తెచ్చిన జలాల్లో ఉంచారు. గ్రామస్తులు పుష్పాలు, ఫలాలు, ధాన్యాన్ని తీసుకొచ్చి విగ్రహాలకు పూజలు చేశారు. మంగళవారం అమ్మవారి విగ్రహాన్ని గర్భగుడిలో ప్రతిష్ఠాపన చేయనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి రంగంపేట ఆశ్రమం పీఠాధిపతి మాధవానంద స్వామి రానున్నారు.

గ్రామాల్లో బీఆర్ఎస్ ప్రచారం



సుతారిపల్లిలో సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

రామాయంపేట(మెదక్): ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ నాయకులు శనివారం మండలంలోని ప్రగతి ధర్మారం, సుతారిపల్లి, శివ్వాయపల్లి గ్రామాల్లో పర్యటించి కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించారు. గ్రామాల్లో జరిగిన సభల్లో పాల్గొన్న బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. పార్టీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి కలెక్టర్‌గా పనిచేసిన కాలంలో నిరుపేదలకు ఎంతో మేలు చేకూర్చారని పేర్కొన్నారు. వెంకట్రామిరెడ్డిని గెలిపిస్తే మన మధ్యనే ఉంటూ మన సమస్యలు పరిష్కరిస్తారని పేర్కొన్నారు. పార్టీలకతీతంగా వెంకట్రామిరెడ్డి అభ్యర్థిత్వాన్ని ప్రజలు బలపరుస్తున్నారన్నారు. రామాయంపేట మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితులను చూస్తే అభ్యర్థి వెంకట్రామిరెడ్డి భారీ మోజారీతో గెలుపొందడం ఖాయమన్నారు. పార్టీకి పూర్వవైభవం వస్తుందన్నారు. పార్టీ ఇన్‌చార్జి శ్రీహరి యాదవ్, రామాయంపేట సహకార సంఘం చైర్మన్ చంద్రం, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ యాదగిరి, మాజీ సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యానికి పౌష్టికాహారం



మర్రిచెట్టుతండాలో నిర్వహిస్తున్న వైద్యపరీక్షలను పరిశీలిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి

కౌడిపల్లి(నర్సాపూర్): సంపూర్ణ ఆరోగ్యానికి గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ రాయిలాపూర్ సెక్టార్ సూపర్‌వైజర్ లక్ష్మి తెలిపారు. శనివారం మండలంలోని మర్రిచెట్టుతండా అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన వైద్య పరీక్షలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేసే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రతీ నెల గర్భిణులు వైద్యపరీక్షలు చేయించుకోవాలని వైద్యుల సలహాలు, సూచనలు పాటించాలని చెప్పారు. దీంతోపాటు మండలంలోని బూరుగడ్డ, వెంకటాపూర్(ఆర్), లింగంపల్లి, కొత్తచెరువుతండా అంగన్‌వాడీ కేంద్రాల్లో వైద్య సిబ్బంది వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

విద్యార్థులు శ్రద్ధతో చదువుకోవాలి

పాపన్నపేట(మెదక్): విద్యార్థులు శ్రద్ధతో చదివి ఉన్నతంగా ఎదగాలని మండల విద్యాధికారి నీలకంఠం అన్నారు. పాపన్నపేట ఉన్నత పాఠశాలను మండల విద్యాధికారి శనివారం సందర్శించి వార్షిక పరీక్షలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాగా చదివి మంచి మార్కులు తెచ్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం పాఠశాల నిర్వహణ ఉపాధ్యాయుల పనితీరుపై అడిగి తెలుసుకున్నారు. ఈ పరిశీలనలో హెచ్ఎం మహేశ్వర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

గాలి వానతో విరిగిన విద్యుత్ స్తంభాలు

అల్లాదుర్గం(మెదక్): మండలంలో శుక్రవారం గాలి వానతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మండల పరిధిలోని గడిపెద్దాపూర్ గ్రామంలో రైతుల వ్యవసాయ పొలాల వద్ద నాలుగు విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పాటు వరి పంట దెబ్బ తిందని రైతు సుధాకర్ చెప్పారు. జొన్న పంట నేల కొరిగిందని, మామిడి కాయలు రాలిపోయినట్లు తెలిపారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరించేందుకు విద్యుత్ అధికారులు వెంటనే పనులు చేపట్టాలని కోరారు.



గడిపెద్దాపూర్‌లో విరిగిపడిన కరెంట్ స్తంభం

గురుకుల పాఠశాలకు 23 మంది ఎంపిక

పాపన్నపేట(మెదక్): గురుకుల పాఠశాలకు శ్రీవిద్య పాఠశాల నుంచి 23 మంది విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం అరవింద్, కరస్పాండెంట్‌లు సుమన్ విఠలాక్షప్ప తెలిపారు. శ్రీవిద్య పాఠశాలకు చెందిన 26 మంది విద్యార్థులు గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్షను ఇటీవల రాయగా.. వారిలో 23 మంది విద్యార్థులు పరీక్షలో ఉత్తీర్ణులైనట్లు చెప్పారు.



గురుకుల పాఠశాలకు ఎంపికైన విద్యార్థులు

సంక్షిప్త వార్తలు

◆ **కాంగ్రెస్‌లో చేరికలు**

పెద్దశంకరంపేట(మెదక్): ఉమ్మడి జిల్లా ప్రణాళిక సంఘం మాజీ సభ్యుడు నగేశ్ షెట్కార్, పీసీసీ సభ్యులు శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం నారాయణఖేడ్‌లో పేట బీఆర్ఎస్ మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండీ.సలీం, పట్టణ మైనార్టీ అధ్యక్షుడు ఎండీ.యాదుల్ కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు భానుగౌడ్, జహంగీర్, మీనాజ్ ఉన్నారు.

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని పలు గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు శనివారం కాంగ్రెస్‌లో చేరారు. డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి సమక్షంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, పలువురు కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు.

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని ముప్పిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మండల బీఆర్ఎస్ నాయకులు సింగి రాంరెడ్డి, నాయకులు మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మల్లారెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

◆ **నీలం మధును గెలిపించాలి**

కౌడిపల్లి(నర్సాపూర్): కాంగ్రెస్ మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధును గెలిపించాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాసరావు తెలిపారు. శనివారం మండలం నుంచి నీలం మధు నామినేషన్ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి మెదక్ రావడంతో మండలం నుంచి కాంగ్రెస్ నాయకులు భారీగా తరలివెళ్లారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

◆ **ఓపెన్ డిగ్రీ ఫస్ట్ సెమిస్టర్ పరీక్ష ఫీజు గడువు మే 6**

నర్సాపూర్ రూరల్: ఓపెన్ డిగ్రీ ఫస్ట్ సెమిస్టర్ పరీక్ష ఫీజు గడువు మే 6వ తేదీతో ముగుస్తుందని డాక్టర్ బీ.ఆర్ అంబేడ్కర్ లెర్నర్స్ సపోర్ట్ సెంటర్ – 136 నర్సాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దామోదర్, కోఆర్డినేటర్ నరేందర్ శనివారం తెలిపారు. ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొని ఫీజు చెల్లించాలని సూచించారు. డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థులకు మే 26 నుంచి జూన్ 1 వరకు మొదటి సెమిస్టర్ పరీక్షలు ఉంటాయని చెప్పారు. పూర్తి వివరాలకు 73829 29736 నంబర్‌కు ఫోన్ చేసి పూర్తి వివరాలు తెలుసుకోవాలన్నారు.

◆ **బీజేపీకి ఓటు వేయాలి**

చేగుంట(తూప్రాన్): మండలంలోని బీకొండాపూర్ గ్రామంలో బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కన్వీనర్ ఎస్ఎస్ చారి మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధి కోసం ప్రధాని మోదీ ఎన్నో రకాల నిధులను అందించారని ఇంటింటి ప్రచారంలో మహిళలకు వివరించారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షులు భూపాల్, నర్సింలు, సంతోష్‌రెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ అంజనేయులు, మాజీ సర్పంచ్ నాగభూషణం, రాజశేఖర్, రామస్వామి, సత్యనారాయణ, రఘు, పద్మరవి పాల్గొన్నారు.

◆ **బీజేపీలో చేరికలు**



వెల్దుర్తి(తూప్రాన్): మండల పరిధిలోని మంగళపర్తి బీఆర్ఎస్ ఎంపీటీసీ అడివయ్యతో పాటు పలువురు నాయకులు శనివారం బీజేపీలో చేరారు. వీరికి బీజేపీ మెదక్ అభ్యర్థి రఘునందన్‌రావు కండువాలు వేసి ఆహ్వానించారు. దేశ ప్రధాని నరేంద్రమోదీ చేపట్టిన అభివృద్ధి పనులు గాను మరోమారు నరేంద్రమోదీ ప్రధాని కావడం ఖాయమని రఘునందర్‌రావు అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లేశంగౌడ్, మురళీధర్ యాదవ్, తదితరులు ఉన్నారు.

◆ **షార్ట్ సర్క్యూట్‌తో పూరి గుడిసె దగ్ధం**

నర్సాపూర్ రూరల్: షార్ట్ సర్క్యూట్‌తో నివాస పూరి గుడిసె దగ్ధమైన సంఘటన మండలంలోని తుజాల్‌పూర్‌లో శనివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన చాకలి నర్సింలు నివాస పూరి గుడిసెలో షార్ట్ సర్క్యూట్ ఏర్పడి మంటలు చేలరేగాయి. దీంతో ఇంట్లోని దుస్తులు, నిత్యావసర సరుకులు, ఎలక్ట్రానిక్ వస్తువులు పూర్తిగా బూడిదయ్యాయి. నర్సింలు కుటుంబం రోడ్డున పడింది. నర్సింలు కుటుంబ సభ్యులు ఉపాధి హామీ కూలీ పనులకు వెళ్లిన సమయంలో షార్ట్ సర్క్యూట్ ఏర్పడినట్లు గ్రామస్తులు తెలిపారు. ప్రమాదం జరిగినప్పుడు చుట్టుపక్కల ఇళ్ల వారు సైతం ఎవరు లేకపోవడంతో మంటలు చల్లార్చక పోవడంతో గుడిసె పూర్తిగా దగ్ధమైందని గ్రామస్తులు తెలిపారు.